

# అత్యాచారం

**కోనేరు రాజబాబు**

పగలంతా విసుగూ విరామం లేని హైదరాబాదు మహానగరాన్ని క్రమంగా చీకటి ఆవరించింది. అమావాస్య రోజేమో ఆ చీకటి మరీ చిక్కగా వుంది. పగలంతా ఆఫీసుల్లో, వ్యాపారాల్లో మునిగిన ప్రజానీకం కార్లలో, స్కూటర్లలో తమ తమ గూళ్ళకు చేరుకున్నారు. శ్రమను మరచేందుకు కొందరు బార్‌లకు చేరుకున్నారు. హుస్సేన్‌సాగర్ బ్రిడ్జిమీద బజ్జీలు, మిక్చరు అమ్మేవాళ్ళు బేరాలు ముగించుకొని మూటాముల్లే సర్దుకున్నారు.

అంత చీకటిలో ఒక యువతి హైదరాబాదు నుంచి సికిందరాబాదు వైపు నడక ప్రారంభించింది. వయసు 23 మించి వుండదు. ఒక్క మాటలో చెప్పాలంటే అమావాస్య చీకటిని కూడా చీల్చి చెండాడగల వన్నె ఆమెది. చేతిలో హ్యాండు బ్యాగ్ వుంది. విగ్రహాలుగా మిగిలి పోయిన మహానుభావులు ఆమెను కళ్ళారా చూస్తున్నారు. హుందాగా హ్యాండు బ్యాగ్ ఊపుకుంటూ ఆమె నిర్భయంగా ముందుకు సాగిపోతోంది. అత్తగారి ఆరళ్ళకు తట్టుకోలేక ఆత్మహత్యకు వచ్చిందా? భర్త వేధింపులకు, ఆడబిడ్డ సాధింపులకు విసిగిపోయి వచ్చిందా? అన్న విషయం తేల్చుకోలేకపోతున్నారు ఇంకా బ్రిడ్జి మీద మిగిలి వున్న కొద్దిమంది జనం.

చీకటి పడినా, అదేమీ తనకు పట్టనట్లుగా ఒక లావుపాటాయన వొళ్ళు తగ్గించుకోవాలని బస్కీలు తీస్తున్నాడు. ఆ రోజుతో తన వొళ్ళు తగ్గిపోవాలని, అంత దీక్షతో వున్న వాడల్లా అమ్మాయిని చూసేసరికి ఐసుగడ్డలా మారిపోయాడు.

గున్న ఏనుగులా దొర్లుకుంటూ క్షణంలో పాపను చేరుకున్నాడు.

''పాపా! పాపా! ఇంత రాత్రప్పుడు ఒంటరిగా ఎక్కడికి వెడుతున్నావు? నీకు భయం వెయ్యటంలా?'' ఆత్రుతగా అడిగాడు.

పాప నుంచి సమాధానం లేదు.

''నగరంలో మొన్న రేప్- నిన్న రేప్. పేపరు చూశావో లేదో- –

నేను తోడుగా వచ్చి మీ యింటిదాకా దిగబెట్టనా?''

దానికీ ఆ అమ్మాయి నుంచి సమాధానం లేదు.

ఈ మాటలు తనకు పట్టనట్టే ముఖభావంగా ఆ అమ్మాయి ముందుకు సాగిపోతోంది. ''ఇదేదో పిచ్చిమాలోకం'' లాభం లేదనుకొని వెనుకకు మరలి తన కసరత్తులో మునిగిపోయాడు లావుపాటాయన. అలా ఆ అమ్మాయి ఒంటరిగా వెడుతున్నందుకు గురజాడవారు, కందుకూరివారు ఒకరినొకరు చూసుకొంటూ తల్లడిల్లిపోతున్నారు ఆ అమ్మాయికి ఏం అఘాయిత్యం జరుగుతుందోనని- కానీ ఆ అమ్మాయి ముఖంలో ఏ భావమూ లేదు. మచ్చునకైనా భయం గోచరించడం లేదు. ఆ నిశీథిలో, నిశ్శబ్ద వాతావరణంలో ఆమె అడుగుల చప్పుడే సంగీత స్వరాలను పలికిస్తోంది. ఆమె అందాన్ని ఆస్వాదిస్తూ స్కూటరు మీద వెడుతున్న ఒక బట్టతలాయన వయ్యారంగా బండిని నడపబోయి బ్యాలెన్స్ తప్పి ఫుట్‌పాత్‌కు గుద్ది కింద పడిపోయాడు.

ఆమె ఇదేమీ పట్టించుకోలేదు.

తనకు పట్టనట్టే- అసలది చూడనట్టే ముందుకు సాగిపోతోంది.

కిందపడ్డ వాడు లేచి అటూ ఇటూ చూసి తన నెవరూ చూడలేదని గమనించి సంబరంతో బట్టలు దులుపుకొని ఏదో సణుక్కుంటూ తనకేమీ తెలియనట్టుగానే ముందుకు సాగిపోయాడు బట్టతలాయన.

బ్రిడ్జి సగం వరకూ నడిచింది అమ్మాయి. జన సంచారం పూర్తిగా తగ్గిపోయింది. చెదురు మదురుగా వచ్చే కార్లు విపరీతమైన వేగంతో వస్తున్నాయి. శిలావిగ్రహంగా వున్న రుద్రమదేవి మాత్రం అమ్మాయి ధైర్యానికి సంబరపడిపోతోంది.

తల పండిన తత్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు కూడా ఆమె మనసులోని భావమేమిటో, ఆ నిశి

రాత్రప్పుడు అక్కడకు ఎందుకు రావలసి వచ్చిందో అవగతం కావటం లేదు. బ్రిడ్జి పక్క లాంజ్‌లో కూర్చున్న ప్రేమ జంట మాత్రం హుస్సేన్ సాగర్ సాక్షిగా ఒకరికొకరు పెళ్ళి చేసుకునేందుకు ప్రమాణాలు చేసుకొంటున్నారు. ఇలా ప్రమాణాలు చేసుకున్న ఎందరినో తన కడుపులో దాచుకున్నానని గుంభనగా నవ్వుతోంది హుస్సేన్‌సాగర్.

నడిచి నడిచి అలసిపోయిందేమో ఆ అమ్మాయి ఫుట్‌పాత్ మీద నిలబడి నిర్మలంగా ప్రశాంతంగా వున్న హుస్సేన్ సాగర్‌ను చూస్తూ సేద తీర్చుకొంటోంది.

ఫుట్‌పాత్‌ను బార్‌గా మార్చి అప్పటి వరకూ తప్పతాగిన ప్రముఖుడొకాయన "ఈ రోజుకు యిక చాలురా" అంటూ చిన్నపిల్ల వానిలా తప్పటడుగులు వేస్తూ కారువద్దకు చేరాడు. ఖాళీ అయిన సీసాలను హుస్సేన్ సాగర్‌లోకి విసురుతూ, మందు మిగిలిన సీసాలను చేతబట్టుకొని అతనిని అనుసరించారు బాడీగార్డులనబడే గూండాలు.

ప్రముఖుడు డ్రైవింగ్ సీట్‌లో కూలబడ్డాడు.

గూండాలు ఇంకా నిలబడి వుండటం చూసి "ఎక్కండెహె- తాగితే మాత్రం కారు నడపలేననుకున్నారా. పది నిముషాలలో గూటికి సేరుత్తా" అన్నాడు.

గూండాలు ఎక్కారు.

కారు ముందుకు సాగింది.

మిగిలిన మందు రెండు గుటకల్లో లోనికి వెళ్ళిపోయింది. ఖాళీ సీసాలు రోడ్డు మీదకు పడ్డాయి శీలం దోచబడ్డ స్త్రీలలాగా- వెంటనే ముక్కలుగా చెల్లాచెదరయినయ్- మారుతీ కారు లైట్లు అమావాస్య చీకటిని 'ఎక్స్‌రే' తీస్తున్నాయి. కారులైట్లు అమ్మాయి చీరమీద పడి ధగధగ మెరిసిపోతోంది. పాలబుగ్గలతో, బంగారు వన్నెతో, సుకుమార శరీరాంగములతో అంతకు రెట్టింపుగా అమ్మాయి మెరుస్తోంది.

"జాక్‌పాట్ కొట్టినవన్నా- ఒంటరిగా వుంది పిల్ల" అన్నారు గూండాలు.

"అమ్మ నీయమ్మ బుగ్గ" అనుకొంటూ కారు వచ్చి అమ్మాయి ముందు ఆగింది. డోర్ తీసేసరికి బ్రాందీ వాసన గుప్పుమంది.

యమకింకరుల్లా గూండాలు కిందకు దిగారు.

తాను ఆమరణ నిరాహారదీక్ష చేసి సాధించిన ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం నడిబొడ్డున జరగబోతున్న ఘోరాన్ని చూడలేక పొట్టి శ్రీరాములుగారు కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకొంటున్నారు.

"ఏయ్ పిల్లా! కారెక్కు" హుకుంజారీ చేశారు గూండాలు.

వాళ్ళ వాలకం చూస్తే 'ఇంట్లో భర్త ఎదుటే భార్యను బయటకు లాక్కొచ్చే సత్తా మాది. నువ్వొకలెక్కా? అన్నట్టుంది.

ఈ మాటలకు మొల్ల తల్లడిల్లిపోతూంది విగ్రహ రూపంలో సాటి ఆడదానికి ఏం అన్యాయం జరుగుతుందోనని.

కానీ అమ్మాయి పలకలేదు- ఉలకలేదు.

"నీకే చెప్తుంట. అనవసరంగా మా చేతులకు పని బెట్టకు- డబ్బెంత కావాలో అడుగు రా!" మరొకసారి ఘీంకరించారు గూండాలు-

దీనికి కూడా ఆ అమ్మాయి నుంచి ప్రతిస్పందన లేదు.

"ఆయన మామూలు మడిసి కాదు. కొద్దిలో తప్పింది కాని అన్న ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావలసినోడు. మర్యాదగా కారెక్కు. మజా తీరాక మంచిగా వదిలేస్తాం. కాదు కూడదన్నావో"

బొడ్లో నుంచి కత్తులు తీశారు గూండాలు. అంత చీకట్లో తళ తళ మెరుస్తున్నాయి.

బ్రిటిష్ వాళ్ళను తన వాడి బాణాలతో వేడెక్కించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆ ఘోరాన్ని చూస్తూ విల్లు నుంచి బాణం తియ్యలేక, అచేతనుడుగా విగ్రహంలా నిలబడి చూస్తుండిపోయాడు.

వాళ్ళ వాలకం చూస్తే పచ్చి నెత్తురు తాగే మనుషుల్లాగున్నారు.

"నీయవ్వ! మా మాటినకుంటే నిన్నటిదానికి పట్టిన గతే పడతది. పిచ్చిముండ- ఎదురుతిరిగి శీలం పోగొట్టుకుంది. ఆఖరికి ప్రాణాన్ని కూడా పోగొట్టుకుంది. కనీసం నువ్వు శీలాన్ని పోగొట్టుకున్నా పేణాన్నన్నా నిలుపుకో" మంచిగా మరో సలహా యిచ్చారు.

'అది సెమిటిదేమోరా' అంటూ పెద్దాయన కారు దిగాడు. ఆకలిగొన్న బెబ్బులిలాగున్నాడు.

"సెమిటిదానితో కూడా మాటలు సెప్పిత్తామన్నా - క్షణంలో అది నీ పక్కనుండాల - లేకుంటే హుస్సేన్‌సాగర్‌లో ఈతకొడతది"

గూండాలు నిప్పులు కక్కుతున్నారు.

అంతటి విపత్తులో వున్నా ఆ అమ్మాయిలో ఇసుమంతయినా భయమూ, ఆందోళన కనుపించడంలేదు.

హుస్సేన్ సాగర్‌లా నిర్మలంగా వుంది.

చెదురుమదురుగా కార్లు వస్తున్నా రాకెట్ వేగంతో పోతున్నాయి. మాకెందుకీ గొడవన్నట్టు కొంతమంది చూసీ చూడనట్టు వెళ్ళిపోతున్నారు. వెళ్ళే ఆ పెద్ద మనుష్యులకు భార్యలున్నారు - ఎదిగిన ఆడపిల్లలున్నారు. తోబుట్టువులున్నారు. కానీ ఆ క్షణంలో అమ్మాయిని ఆకలి గొన్న బెబ్బులి కబళిస్తుంటే సాయానికి వచ్చిన వారే లేరు.

కొంచెం దూరంలో కాళ్ళూ చేతులూ లేని బిచ్చగాడు రంగడు అమ్మాయి పరిస్థితి చూసి తల్లడిల్లి పోతున్నాడు. "ఈ నాయాళ్ళు" ఈ రోజు కూడా వచ్చారా? అనుకొంటూ అంగలోపం కల్గించిన దేవుడ్ని తిట్టుకుంటున్నాడు.

ఆ స్థితిలో అతనేం చెయ్యగలడు!

అప్పుడే రయ్‌మంటూ పోలీసు వ్యాను వచ్చింది

రంగడు అది చూసి సంబర పడి పోయాడు. కానీ అతని సంతోషం ఎంతో సేపు నిలవ లేదు. అదే వేగంతో వ్యాను ముందుకు సాగి పోయింది. రంగడు మనసులోనే వారి నిర్లక్ష్యానికి తిట్టుకున్నాడు.

"చూశావా బుల్ బుల్! పోలీసులకు కూడా మన కారు నంబరు చూస్తే దడ. మనమున్న చోటుకు ఆమడ దూరంలో వుంటారు. మూడంకెలు సదువుతా - మూడనేలోపు మా అన్న సెయ్యట్టుకొని ముద్దు పెట్టుకోవాల - లేకుంటేనీ శీలానికి శ్రీరామ. పేణాలు హుళక్కి"

ఆ ఇదిగో సదువుతూండ -

"ఒకటి!"

చలనం లేదు -

"రెండూ!" సహనం తప్పిన గొంతుతో అరిచాడు గూండా -

ఆ శబ్దం నిశ్చల వాతావరణంలో ప్రతిధ్వనించింది -

మరి కొద్ది క్షణాలలో మరొక అబలను తన పొట్టన బెట్టుకోవాలన్న బాధతో హుస్సేన్ సాగర్ కంట తడిపెడుతోంది -

తమ సేవలను తుదకు ప్రాణాలను మానవాళి మహోన్నతికే అర్పించి శిలా విగ్రహాలుగా ప్రతిష్ఠించబడిన పెద్దలు జరగబోయే ఘోరాన్ని చూడలేక తలలు దించుకున్నారు.

అష్ట కష్టాలు పడి, లాఠీ దెబ్బలు తిని, తూటా దెబ్బలకు ఎదురొడ్డి పరాయి పాలనను అంతమొందించి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించింది ఇందుకేనా? ఒంటరిగా బయటకు వచ్చిన అబలకు రక్షణ లేదా? ఇదే వారి ఆవేదన -

ఈ ఘోరాన్ని చూడవలసిన దురదృష్టం తనకు లేనందుకు నీటిలో మునిగిపోయిన బుద్ధుడు

సంబరపడిపోతున్నాడు.

"మూడు!" కర్కశంగా కఠోరంగా వుంది కంఠం -

అంతే రెప్పపాటులో కత్తులు పైకి లేచాయి ఒక్కసారిగా-

మెరుపు వేగంతో మళ్ళీ ఫుట్‌పాట్ మీద గళ్ళుమని శబ్దం వేస్తూ పడిపోయాయి.

మరో క్షణంలో అమ్మాయి ఇచ్చిన రెండు షాట్లకు గూండాలిద్దరూ నేలను కరుస్తూ అమ్మాయి కాళ్ళమీద పడ్డారు.

"ఏయ్! మామీదే చెయ్యి వేసుకుంటావే- నీ యవ్వ నిన్ను సంపేత్తాం!" అనే గూండాల చేతులు మాత్రం అమ్మాయి కాళ్ళ కింద నలిగి పోతున్నాయి -

గింజుకులాడారు. కానీ లాభం లేకపోయింది-

"అన్నా! దీన్ని బతక నివ్వకు నీ తుపాకి తో కాల్చెయ్" అని అరిచారు.

మత్తు వదిలిన పెద్దాయన తుపాకి కోసం కారులోకి వెళ్ళబోయాడు.

"హ్యాండ్సప్" అడుగు ముందుకు వేశావా కాల్చేస్తాను" అన్న పెద్ద గొంతు వినే సరికి పెద్దాయన చేతులు పైకెత్తి మగగొంతు ఎవరిదన్న

• కె.రాజ్యలక్ష్మి సీరియల్

• "గడపకిఅటూ ఇటూ"

• త్వరలో!

ఆశ్చర్యంలో మునిగి పోయాడు. ఇంతలో పోలీసు వ్యాను వచ్చి ఆగింది. అందులో దిగిన పోలీసులు అమ్మాయికి సెల్యూట్ చేశారు.

తల మీద విగ్గు తీస్తూ "రాస్కెల్స్! స్త్రీని గౌరవించే మన ఆచారాన్ని మరచి తప్పతాగి ఇలా అత్యాచారాలకు పాల్పడుతున్నారా? మీరు మాట్లాడిన మాటలన్నీ రికార్డు చేశాను. ఈ పోలీసు కమీషనర్ ఇక్కడుండగా మీలాంటివారి ఆటలు సాగవు. కోర్టులో హాజరు పరచి మీ అంతు తేలుస్తాను.

కానిస్టేబుల్స్! వీళ్ళ ముగ్గురికీ చేతులకు బేడీలు వేసి వ్యాన్ ఎక్కించండి" అంటూ ఆజ్ఞ జారీ చేశాడు ఆ రోజే అసిస్టెంట్ కమీషనర్‌గా పదవిలో చేరిన ఆనంద్‌బాబు.

ఇంతవరకు ఆడ వేషంతో వున్నది పోలీసు కమీషనరా? రౌడీలకు నోట మాటలేదు. వ్యాను కంట్రోల్‌రూం వైపుకు దూసుకుపోయింది.

"ఇలాంటి నికృష్ట వాతావరణంలో కొత్తగా పోలీసు కమీషనర్‌గా వచ్చిన యువకుడు ఆనంద బాబు కాలేజీ నాటకాల్లో ఆడ పాత్రలు వేసిన అనుభవంతో అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తులను నాటక ఫక్కీలో పట్టుకోవడం - నిజంగా అభినందించదగ్గ విషయం - నగరంలో వరుసగా రెండు రోజులు అత్యాచారాలు జరిగిన తరుణంలో ఇలాంటి చర్య స్త్రీ జాతిలో, ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రుల్లో మనోధైర్యాన్ని పెంచుతుందని ఆశిద్దాం" అది చదివిన వారంతా -

ఆ చిరు దీపం పది కాలాలపాటు ఒడుదుడుకులు లేకుండా దివ్యంగా, దేదీప్య మానంగా వెలగాలని ఆశించారు. ●





కొత్త
షేర్
మిక్కిలి సురక్షితమైన తొడుగులు




భారతదేశపు మొట్టమొదటి స్పర్మిసిడల్ తొడుగులు

హిందుస్థాన్ లేటెక్స్ లిమిటెడ్ ప్రపంచంలో తొడుగుల తయారీలో అతిపెద్ద సంస్థ.

R K SWAMY/BBDO HLL 8737TE